క్లుప్తంగా

మే 1న బల్లిగిరి వెంకన్న వార్షిక కల్యాణోత్సవం



విశేష అలంకరణలో బల్లిగిరి వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం మే 1వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి వారం రోజుల పాటు విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, 1001 కలశాలతో విశేష అభిషేకాలు, పుష్పయాగం తదితర ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల భక్తులు దేవస్థానం కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. భక్తుల సహకారంతో ప్రతి ఏడాది స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపడుతున్నామన్నారు.

ఆధ్యాత్మికవేత్తకు ఉగాది పురస్కారం



రాజశేఖర్‌కు ఉగాది పురస్కారం అందజేస్తున్న వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

డాబాగార్డెన్స్: రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించారు. శ్రీరామ తత్వంపై ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రసంగించారు. అనంతరం 30 ఏళ్లకు పైగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక రంగాలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నందుకుగాను ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి చేతుల మీదుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్‌కు ఉగాది పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ పోర్ట్‌సిటీ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శి సుధీర్‌చౌదరీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయానికి రావాలి



రీడర్స్‌క్లబ్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

అల్లిపురం: బంగారుమెట్ట శాఖా గ్రంథాలయంలో ఆదివారం రీడర్స్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలతో పాటు బొమ్మరిల్లు, చందమామ, కామిక్స్, జీకే, కరెంట్ అఫైర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లలు శ్రద్ధగా చదివి విజ్ఞానం పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, రైల్వే ఏరియా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న వారికి ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఐసీడబ్ల్యూఏఐ భవన్ పక్కన, అక్కయ్యపాలెం హైవే వద్ద గల సత్యసాయిబాబా సాయిసౌధలో కోచింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 10 నుంచి మే 13 వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 92480 52173, 63003 66227, 73860 86177 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పిల్లలు కాదు.. పిడుగులు

- చిరుప్రాయంలోనే నూతన ఆవిష్కరణలు
- ఆలోచింపజేసే సృజనాత్మకత
- సత్తా చాటుతున్న జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల విద్యార్థులు



పిల్లలు రూపొందించిన బొమ్మలు, క్యాప్షన్లు చూపుతున్న స్కూల్ మెంటార్ శ్యామల



పిల్లల మేధాశక్తికి నిదర్శనం.. ఈ సృజన



ఎల్‌పీజీ డిటెక్టర్ పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్: వారంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద పిల్లలు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే సత్తా వారి తల్లిదండ్రులకు లేదు. మూడు పూటల తిండి లేని పిల్లలు ఎంతో మంది ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.చదువుపై పిల్లలు చూపుతున్న ఆసక్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా ఆ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉచిత విద్య కింద ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోంది. మరీ ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోకుండా ఉండేలా అన్ని విధాల ప్రభుత్వం సాయం అందిస్తోంది. విద్యార్థులకు కావల్సిన పరికరాలు, యూనిఫామ్స్, షూస్, పుస్తకాలు వంటి విద్యా పరికరాలతో పాటు చదువుకునేందుకు వీలుగా మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుంటే.. ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకు జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాలే నిదర్శనం. ఇటీవల రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు జీవీఎంసీ–సీఎంఆర్ ప్రకాశరావుపేట స్కూల్ విద్యార్థులు ఎంపకయ్యారంటే.. ఆ ఘనత ఇటు విద్యార్థులదే గాక.. విద్యార్థులకు దిక్సూచిలా ఉన్న ఉపాధ్యాయులదీ కూడా. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు ఉపాధ్యాయులు పదును పెడుతుంటే.. ఉపాధ్యాయులు అందిస్తున్న స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారు ఆ పిల్లలు. ఇటీవల జిల్లాస్థాయి సైన్స్ ఫేర్‌లో ఈ పాఠశాల విద్యార్థులు ఎల్‌పీజీ లీకేజ్ డిటెక్టర్‌పై చేపట్టిన ప్రదర్శన పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. వీరిలో ఇంత టాలెంట్ ఉందా.. అంటూ ముక్కున వేలేసుకున్నారు. స్కూల్ మెంటార్ డి. శ్యామల నేతృత్వంలో విద్యార్థులు సీహెచ్ రాహుల్, సీహెచ్ దీప్తిశ్రీ, కె. వెంకటశ్రీహర్ష పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన..

ఇదిలా ఉండగా.. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయడానికి ఇదే నిదర్శనం. మ్యాథ్స్ ఈజ్ ఆల్ ఔట్ బికమింగ్ ఏ క్రియేటివ్ థింకర్.. నాట్ ఏ క్యాలుకులేటర్, గోల్స్ ఆర్ స్మాల్ స్టెప్స్ యూ కెన్ టేక్ టు అచీవ్ యువర్ డ్రీమ్స్, ఇఫ్ యూ డిఫైన్ ది ప్రాబ్లమ్ కరెక్ట్‌లీ..యు ఆల్మోస్ట్ హేవ్ ది సొల్యూషన్.. అంటూ ఇలా ఎన్నో క్యాప్షన్స్‌తో రూపొందించిన పోస్టర్లు, వేసిన ఆర్ట్స్, తయారు చేసిన బొమ్మలు పిల్లల మేధాశక్తికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. సాధారణంగా జీవీఎంసీ పాఠశాలల్లో చదివే పిల్లల నైపుణ్యం పట్ల చాలా మందికి గురి కుదరదు. అటువంటి పాఠశాలల పిల్లలే ఆణిముత్యాల్లా మెరుస్తూ భవిష్యత్ పట్ల ఆశలు చిగురింపజేస్తున్నారు.



పిల్లలు గీసిన చిత్రాలు

చిన్నారులకు మార్గదర్శకం



పిల్లలతో ముచ్చటిస్తున్న శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: పాత నగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఫ్రీ ట్యూషన్ సెంటర్లో చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ సంఘ సేవకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆదివారం సందేశమిచ్చారు. ఇదీ పరీక్షా సమయమని, సంవత్సరమంతా కష్టపడి చదివారు. బాగా పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఈ వేసవిలో సమ్మర్ క్యాంప్‌లో ఉచిత యోగా తరగతులు, కూచిపూడి శిక్షణ శిబిరాలు నిర్వహిద్దామని సూచించారు. కాసేపు పిల్లలతో సరదాగా గడిపారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి పిల్లలకు మొదటి గురువులు తల్లిదండ్రులేనని, పిల్లల్ని మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యతల తల్లిదండ్రులదేనన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్‌కోర్ట్ వ్యాపారులు వాహనాలు తీసుకెళ్లిపోవాలి



ఫుడ్‌కోర్టు వద్ద పరిశుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: ఫుడ్‌కోర్టులో వ్యాపారాల అనంతరం వాహనాలను ఇళ్లకు తీసుకెళ్లిపోవాలని జీవీఎంసీ జోన్‌-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ అన్నారు. ఆదివారం ఆయన ఫుడ్‌కోర్టులో చెత్తను పరిశుభ్రం చేయించారు. వ్యాపారులు తమతమ బండ్ల కింద చెత్త పడకుండా ప్లాస్టిక్ కవర్లు వేసుకుని అమ్మకాలు చేసుకోవాలని గతంలోనే చెప్పామన్నారు. అయితే వ్యాపారులు తాము చెప్పినట్లు చేయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్యంగా మారి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ఉదయాన్నే సెంట్రల్ పార్కుకు వచ్చే వాకర్లు, పాదచారులు ఇబ్బంది పడుతూ జీవీఎంసీకి ఫిర్యాదు చేస్తున్నారన్నారు. మద్యం సేవించిన బాటిళ్లు కూడా ఇక్కడే ఉంటున్నాయన్నారు. దీనిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. వ్యాపారులు తమ శైలి మార్చుకుని జీవీఎంసీకి సహకరించి, ప్రజారోగ్యం, నగర సుందరీకరణకు సహకరించాలన్నారు. జీవీఎంసీ ఆస్తులకు నష్టం చేకూరిస్తే వ్యాపారుల నుండి అపరాధ రుసుము వసూలు చేస్తామని ఏఎంహెచ్‌వో తెలిపారు.

రహదారిపై దుకాణాలు పెట్టొద్దు



పూర్ణామార్కెట్ వద్ద వ్యాపారులను హెచ్చరిస్తున్న ఎస్సై భాస్కరరావు

జగదాంబ: రహదారిపై దుకాణాలు పెడితే చర్యలు తప్పవని వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్సై భాస్కరరావు హెచ్చరించారు. ఆదివారం పూర్ణామార్కెట్ రహదారిపై అడ్డంగా పెట్టిన దుకాణాలను తొలగించారు. ప్రజలు, వినియోగదారులకు ఇబ్బంది కలిగించేలా దుకాణాలు పెట్టకూడదన్నారు. వినియోగదారులు మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేసుకునే విధంగా దుకాణాలు లోపలికి పెట్టుకోవాలని సూచించారు. అదే విధంగా వాహనాలు కూడా రహదారిపై అడ్డంగా పెట్టి మార్కెట్‌లోకి వెళ్లిపోతున్నారన్నారు. వాహన చోదకులు మార్కెట్ బయట జీవీఎంసీ ఏర్పాటు చేసిన పార్కింగ్‌లోనే వాహనాలు పెట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా పందుపుల్లల సందు, స్ప్రింగ్‌రోడ్డు, బౌడారారోడ్డు, నూనెమిల్లువీధి, మంచాలవీధి ప్రాంతాల్లో రహదారులపై ఆక్రమణలు తొలగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మొదలు కాని అంగన్‌వాడీ భవన నిర్మాణం

- ఇబ్బంది పడుతున్న చిన్నారులు



అంగన్‌వాడీ భవన నిర్మాణం జరగాల్సిన స్థలం

జగదాంబ: అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు మొదలు కాకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకల వద్ద అంగన్‌వాడీ భవనం ఉండేది. అయితే పూర్వ కాలం నాటి భవనం కావడంతో పూర్తిగా శిథిలమైపోవడంతో కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. దీంతో అందులో చదివే చిన్నారుల సౌకర్యార్థం కల్లుపాకలు వెనుక ఉన్న మరో అంగన్‌వాడీ కేంద్రంలో రెండు సెంటర్లు నిర్వహిస్తున్నారు. రెండు అంగన్‌వాడీ సెంటర్లు ఒకే దగ్గర నిర్వహించడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. రెండు నెలల కిందట నిర్మాణానికి ప్రారంభోత్సవం జరిగిన ఈ స్థలంలో ఇప్పటికీ పనులు మొదలు కాకపోవడంతో చుట్టుపక్కలుండే స్థానికులు తమ అవసరాలకు ఈ స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని మొదలుపెట్టాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీరామ శోభాయాత్ర



తన తోకతో లంకను చుట్టుముట్టిన ఆంజనేయస్వామి



మేము సైతమంటూ జైశ్రీరామ్ జెండాలతో చిన్నారులు

డాబాగార్డెన్స్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 29వ వార్డు పరిధి ప్రకాశరావుపేటలో గల శ్రీరామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. ప్రకాశరావుపేట రామాలయం నుంచి బయలుదేరిన శోభాయాత్ర సూర్యాబాగ్ పూర్ణానంద సమాజం, సరస్వతీ పార్కు, డాబాగార్డెన్స్ సెంటర్ పాయింట్ హోటల్, గీతాభవనం మీదుగా తిరిగి ప్రకాశరావుపేట రామాలయం వరకు కొనసాగింది. జై శ్రీరామ్ అంటూ రామదండు నినాదాలతో శోభాయాత్ర హోరెత్తింది. సీతారామచంద్రస్వామి లక్ష్మణ సమేత హనుమత్ స్వామి వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. ఆంజనేయస్వామి లంకను చుట్టుముట్టిన ప్రదర్శన చూపరులను ఆకర్షించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీతో పాటు గ్రామ ప్రజలు, నగర ప్రజలు పాల్గొన్నారు.



రామదండుతో ఆలయ కమిటీ

నేడు పోలమాంబ తొలేళ్ల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలమాంబ ఆలయం

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం జరగనుంది. స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద తొలేళ్ల ఉత్సవాలు జరపనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అనుపు మహోత్సవం జరగనుంది. ఈ రెండు రోజులూ అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా తెలిపారు.

ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే రోడ్డు మార్గాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం జరిగే ప్రధాన పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు. చలువ పందిరి, ఆలయ ప్రాంగణంలో టెంట్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు వివిధ క్యూలైన్లను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రవేశాలు కల్పించనున్నారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేయనున్నట్టు చైర్మన్ తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: శ్రీదేవి మహానటి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నా జీవన బృందావనిలో.. ఆమని ఉదయంలో' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను మైమరిపించింది. సంస్థ గౌరవ అధ్యక్షుడు జీఎంఆర్ నెహ్రూ నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. సంగీత విభావరిలో వీవీ చారి, అమ్మాజీరావు, పుండరికుమార్, ఎమ్మెస్ మాధవ్, మెలోడీ సత్యనారాయణ, కేఎస్ ప్రకాష్, మహ్మద్‌ఖాన్, ఎస్ఎస్ఎన్ రాజు, భయ్యా శ్రీనివాస్, రమణి, దేవీప్రియ, గీత, లిఖిత తదితర గాయనీ గాయకుల సినీ గీతాలు అలరించాయి. యువ గాయకుడు గంటి అభినయ స్వరానికి అనుగుణంగా సాత్విక, కందర్పరాధ తదితరులు శ్రావ్యంగా గీతాలు ఆలపించారు. కార్యక్రమాన్ని కొణతాల రాజు, రాజేంద్రప్రసాద్, విజయరమణి, సోషల్ మీడియ స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, ఎంవీ రాజశేఖర్, చెన్నా తిరుమలరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాధారాణి, సోమేష్, శివ, అప్పలరాజు, బాబ్జి, పైడిరాజు సంగీత సహకారం అందించారు.

ఉల్లాసంగా పరీక్షలకు..

- నియోజకవర్గం నుంచి 602 మంది పది విద్యార్థులు



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుపెన్సిల్ కిట్లు అందజేస్తున్న కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్

డాబాగార్డెన్స్: పది పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించి సత్తా చాటేందుకు జీవీఎంసీ, ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల విద్యార్థులు ఉల్లాసంగా పరీక్షలకు వెళ్తున్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలో గల ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల నుంచి అత్యధికంగా 220 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతుండగా, సీఎంఆర్–జీవీఎంసీ పాఠశాల నుంచి 74 మంది విద్యార్థులు వెళ్తున్నారు. వీరిలో 27 మంది బాలురు, 47 మంది బాలికలు ఉన్నారు. వీరంతా 12 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ఎంవీడీ హైస్కూల్ (దండుబజార్) నుంచి మొత్తంగా 102 మంది విద్యార్థుల్లో 60 మంది బాలురు, 42 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. జీవీఎంసీ ఎంవీడీఎం హైస్కూల్(లక్ష్మీటాకీస్) నుంచి పరీక్షకు హాజరుకానున్న 96 మంది విద్యార్థుల్లో 62 మంది బాలురు, 24 మంది బాలికలు 10 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ (ఎంజీఎం హైస్కూల్) నుంచి 110 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో 66 మంది బాలురు, 44 మంది బాలికలు ఉన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

అల్లిపురం: పది పరీక్షలు సోమవారం నుంచి జరగనున్న నేపథ్యంలో జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వరమెట్టపై ఆదివారం వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో సుమారు 240 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్ను, పెన్సిల్ తదితర సామగ్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



వీధుల్లో మట్టలతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కొబ్బరితోటలో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు, చిన్నారులు

అల్లిపురం: అల్లిపురం, కొబ్బరితోట, భూపేష్‌నగర్, సౌత్‌జైలురోడ్డు ప్రాంతాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలతో పాటు పెద్ద వారు ఈత మట్టలకు పూలు అలంకరించి ఏసుక్రీస్తు సువార్త ప్రకటిస్తూ యేసు లోక రక్షకుడని పురవీధుల్లో తిరుగుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొబ్బరితోటలోని యేసుక్రీస్తు అందరికీ ప్రభువు ప్రార్థన మందిరం ఫాస్టర్ రూతమ్మ మాట్లాడుతూ క్రీస్తు శాంతి సమాధానానికి మూల పురుషుడని, ఏసు ప్రభువు అందరికీ దేవుడన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం వారు కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, మనోరమా థియేటర్ , మురళీధరవీధి ప్రాంతాల్లో పాటలు పాడుతూ తిరువీధి నిర్వహించారు.

పునీత పేతురు ప్రధాన దేవాలయంలో..

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ నేతృత్వంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలతో జ్ఞానాపురం వీధుల్లో ప్రార్థనలు చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తుకు జెరూసలేం పట్టణంలోకి వచ్చే సమయంలో నాటి ప్రజలు మ్రానుకొమ్మలతో స్వాగతం పలికినట్లు చెప్పారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి తపస్సు కాలంలో మ్రానుకొమ్మల ఆదివారం నిర్వహిస్తారన్నారు. సహాయ విచారణకర్తలు బైబిల్ చదివారు. ఈస్టర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రతిరోజు చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బి.జోసెఫ్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.



స్లీవ్ గుర్తు వీధిలో మట్టలకు ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న హైకోర్ట్ జస్టిస్

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మిని రాష్ట్ర హైకోర్టు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి వారిచే అమ్మవారికి పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

నగరానికి చెందిన వై చంద్రశేఖర్, వై స్వర్ణలత దంపతులు కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,001 విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు ముద్దాడ వెంకటరమణ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మ సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు జస్టిస్



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాతలు